క్లుప్తంగా

వేతన సవరణను అమలు చేయాలి

భానుపురి : సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను వెంటనే అమలు చేయాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎల్. మోహన్ సింగ్ అన్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఆదేశానుసారం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్ఐసీ ఆఫీస్ ఎదుట సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ప్రభాకర్, డివిజన్ కమిటీ మెంబర్ కె. రామయ్య పాల్గొన్నారు.

17న నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న శాంసన్

భానుపురి : సూర్యాపేట పట్టణ పాస్టర్ల కమిటీ రద్దు కాలేదని, త్వరలోనే నూతన కమిటీని ఎన్నుకుంటామని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ మామిడి శాంసన్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న పాత పట్టణ కమిటీ స్థానంలో కొత్త కమిటీ ఎన్నికకు కార్యాచరణ ప్రారంభమైందన్నారు. పట్టణంలోని ప్రతి పాస్టర్ బ్యాలెట్ పత్రం ద్వారా తమ అభిప్రాయాన్ని తెలపాలన్నారు. ఈ నెల 17న నూతన కమిటీ ఎన్నిక నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ప్రభుదాస్, డి.పాలు, జోహర్ పాల్, మీసాల ప్రభుదాస్, జె.వై.వి రమేష్ బాబు, సామ్యూల్, కరుణాకర్, డేవిడ్ రాజు, లింగనాయక్ పాల్గొన్నారు.

13న మల్లూర్ వర్ధంతి

నాగారం : మోతే మండలంలోని సిరికొండలో ఈ నెల 13న నిర్వహించే సూర్యాపేట తొలి శాసనసభ్యుడు ఉప్పల మల్లూర్ 25వ వర్ధంతిని జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు వరికుప్పల వెంకన్న కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉప్పల మల్లూర్ చిన్నతనం నుంచే కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితుడై నిస్వార్థ రాజకీయ జీవితాన్ని గడిపారని తెలిపారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. ఆస్తులు, అంతస్తులు లేకుండా సాదాసీదా జీవితం గడిపిన గొప్ప మహనీయుడు ఉప్పల మల్లూర్ అని కొనియడారు.

ఘనంగా దీపోత్సవం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం సహస్ర దీపాలంకరణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాలకు సంబంధించి 24వ పాశురాన్ని అర్చకులు పఠించి భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా మహిళలు వెయ్యి దీపాలను వెలిగించారు. అలాగే గోదాదేవికి మంగళహారతులిచ్చి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

గోదావరి జలాలకు పూజలు



వెంపటిలో గోదావరి జలాలకు పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుంగతుర్తి : 69 డీబీఎం కాలువ ద్వారా ఎస్సారెస్పీ నీళ్లు వెంపటి గ్రామానికి చేరడంతో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం గోదావరి జలాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడారు. ప్రభుత్వం చెప్పిన విధంగా నీటిని విడుదల చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తప్పెట్ల శంకర్, మల్లేష్‌నేత, కొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

కోదాడఅర్బన్ : రిటైర్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి అన్నారు. బుధవారం కోదాడలో ఎమ్మెల్యేను విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కోదాడలో తాను అత్యధిక మెజార్టీతో గెలిచేందుకు విశ్రాంత ఉద్యోగులు చేసిన సహకారం మరువలేనిదన్నారు. పెన్షనర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేస్తామని తెలిపారు. కోదాడలో సీనియర్ సిటిజన్స్ కోసం వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తానన్నారు. అంతకుముందు జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా నకారా విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆర్.సీతారామయ్య, మల్లెంపల్లి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, వంగవీటి రామారావు, పారా సీతయ్య, ప్రసన్న, సంఘం సభ్యులు లక్ష్మీనర్సయ్య, రాంబాబు, సుదర్శన్‌రెడ్డి, వరప్రసాదరావు, విద్యాసాగర్‌రావు, నర్సయ్య, భ్రమరాంబ, తదితరులు పాల్గొన్నారు.

నిధుల లేమితో నిలిచిన పనులు



రామన్నగూడెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణం



కొమ్మాలలో నిలిచిన నిర్మాణ పనులు..

- అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు నిధుల కొరత
- కొమ్మాల, రామన్నగూడెంలలో మధ్యలోనే ఆగిన పనులు
- అదనపు నిధుల కోసం ఎదురుచూపు

అర్వపల్లి : అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణ పనులు నిధుల లేమితో అసంపూర్తిగా నిలిచిపోయాయి. గతంలో మంజూరైన నిధులు చాలకపోవడంతో ఉన్న బడ్జెట్ వరకు పనులు చేపట్టారు. మిగిలిన పనులు నిధుల లేమితో ఆగిపోయాయి. అయితే జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా 36అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 31 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో నడిపిస్తున్నారు. మిగిలిన 5కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అయితే కొన్నింటిలో సౌకర్యాలు కొరవడటం, అద్దె భవనాలు ఇరుకుగా ఉండటంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

రెండు భవనాలకు నిధులు..

జాజిరెడ్డిగూడెం మండలంలోని రామన్నగూడెంలో డీఎంఎఫ్ నిధులు రూ.9లక్షలతో అంగన్‌వాడీ కేంద్రానికి సొంతభవన నిర్మాణ పనులు గతంలో మొదలయ్యాయి. అయితే ఈ బడ్జెట్ ఉన్నంత వరకు పనులు చేపట్టారు. ఇంకా ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్‌తో పాటు తలుపులు, కిటికీలు బిగించుట, ఇతర చిన్న చిన్న పనులు పూర్తి కావాల్సి ఉంది. అదనంగా మరో రూ.2 లక్షలు అవసరమని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇక్కడి కేంద్రం ప్రాథమిక పాఠశాలలోని ఓ తరగతి గదిలో నడిపిస్తున్నారు. అలాగే కొమ్మాల గ్రామంలో కూడా డీఎంఎఫ్ నిధులు రూ.7లక్షలు మంజూరు కాగా అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవన నిర్మాణం పనులు చేపట్టారు. కానీ నిధులు చాలక పనులు పూర్తి కాలేదు. అదనంగా రూ.2.50 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికైనా అదనపు నిధులు మంజూరు చేసి ఈ భవనాల నిర్మాణాలను పూర్తిచేయాలని ఆయా గ్రామాలవాసులు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



రామన్నగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తాత్కాలికంగా పాఠశాలలో నడిపిస్తున్నాం. ఈ కేంద్రంలో 30మంది పిల్లలు చదువుకుంటుండగా, 25మంది గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం పొందుతున్నారు. ఇక్కడ భవన నిర్మాణం పూర్తయితే ఇబ్బందులు తీరనున్నాయి. – అనిరెడ్డి పుష్ప, అంగన్‌వాడీ టీచర్, రామన్నగూడెం

ప్రతిపాదనలు పంపాం



రామన్నగూడెం, కొమ్మాలలో డీఎంఎఫ్ నిధుల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల నూతన నిర్మాణ పనులను ప్రారంభించాం. అయితే నిధులు చాలక పనులు ఆగాయి. ఈ రెండు కేంద్రాలకు అదనంగా మరో రూ.4.50 లక్షలు మంజూరైతే పనులు పూర్తి కానున్నాయి. ఈ నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. – అశోక్, పీఆర్ ఏఈఈ

సంక్రాంతి సంబరాల నిర్వహణ అభినందనీయం



ముగ్గుల పోటీలో మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సూర్యాపేటటౌన్ : అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం అభినందనీయమని ఎస్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ చైర్మన్ సంకినేని హేమలత అన్నారు. జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద బుధవారం నిర్వహించిన అక్షర సంక్రాంతి సంబరాల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అక్షర ఫౌండేషన్ వారు తెలుగు ప్రజల ఆచార, సంప్రదాయాలకు అనుగుణంగా సరికొత్త రీతిలో సంక్రాంతి కార్యక్రమాలు నిర్వహించడం గొప్పవిషయమన్నారు. ముగ్గులు, పతంగులు, కోలాటం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ చైర్మన్, ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాస రాంకుమార్ రెడ్డి, కౌన్సిలర్ పలస మహాలక్ష్మి, ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పు నాగయ్య, సొల్లేటి ఉపేంద్రాచారి, దామోదర్ రెడ్డి, రుద్రంగి కాళిదాసు, మదూరి హనుమాచారి, తిరుమల్ రెడ్డి, పాపయ్య, యాస శృతి, బత్తుల ఉపేందర్, వీర్లపాటి వెంకన్న, నజీర్ భాషా, అప్పారావు, కాసర్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి అలంకరణలో శ్రీనివాసుడు



శ్రీకృష్ణుడి అలంకరణ



వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

భానుపురి : సూర్యాపేట పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు కొనసాగుతున్నాయి. 25వ రోజు ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యుల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో శ్రీ వేంకటేశ్వర స్వామిని శ్రీకృష్ణుడిగా అలంకరించారు. భక్తులందరూ యశోదాదేవి, గోపికలుగా దుస్తులు ధరించి శ్రీకృష్ణుడి చిత్రపటాలతో ఆడుతూ పాడుతూ భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి ఆండాళ్ గోష్ఠి భక్తబృందం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పోరుగర్జన సభ పోస్టర్ల ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి : హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో ఫిబ్రవరి 29న జరిగే చలో హైదరాబాద్ పోరుగర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు పరశురాములు మాదిగ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆ సంఘ కార్యాలయం ఆవరణలో చలో హైదరాబాద్ పోరు గర్జన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెప్పులు కుట్టే వృత్తిదారులకు నెలకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర మంత్రివర్గంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగయ్య, నాయకులు దగ్గుపాటి వెంకన్న, దైవ ఉపేందర్, బండారి సంపత్, గోలి మహేష్, వాసు, విజయ్, అభిషేక్, మహేష్ పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

పెన్‌పహాడ్ : గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని డీఎల్‌పీఓ సాంబిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నరేష్, పంచాయతీ కార్యదర్శి శివ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నాగారం : నాగారం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.శోభారాణి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మండల సర్వసభ్య సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరవుతున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

19న జిల్లా సదస్సును జయప్రదం చేయాలి

దురాజ్‌పల్లి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరిగే ఆందోళనల విజయవంతానికై ఈ నెల 19న సూర్యాపేటలో నిర్వహించే కార్మిక, కర్షక జిల్లా సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మల్లు నాగార్జున్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట్ నరసింహారెడ్డి భవన్‌లో జరిగిన సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ విధానాల మూలంగా దేశం దివాలా తీసిందని అన్నారు. ప్రజల సంపదను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు అక్రమంగా కట్టబెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండ వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొప్పుల రజిత, గ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ చెరుకు ఏకలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పులుసు సత్యం, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందాల శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



తుంగతుర్తి కేజీబీవీలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దొనకొండ రమేష్



ఆత్మకూర్(ఎస్) : ప్లేట్లు పంపిణీ చేస్తున్న కార్తీక్ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని కేజీబీవీలో చదువుతున్న విద్యార్థులకు కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు దొనకొండ రమేష్ బుధవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఈ విషయాన్ని తెలియజేసినట్లు తెలిపారు. దీంతో వెంటనే మంత్రి స్పందించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుప్పట్లు, బెడ్‌షీట్లు అందజేశారని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి మౌనిక, కొత్తగూడెం సర్పంచ్ నకిరేకంటి విజయ్, ఓరుగంటి సత్యనారాయణ, కటకం వెంకటేశ్వర్లు, సీహెచ్.రాములు, జటంగి మహేష్, రాములు, దాచేపల్లి సతీష్, లింగరాజు, సందీప్, చంద్రయ్య, లింగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

ఆత్మకూర్(ఎస్) : స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించడం, పేద పిల్లలకు మౌలిక వసతులు కల్పించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు కడపర్తి శ్రీనివాస్‌నాయుడు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కందగట్ల ఆవాసం భజనతండా ప్రాథమిక పాఠశాలలో కార్తీక్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు గోగుల మధుసూదన్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ సైదమ్మ, మాజీ సర్పంచ్ కేవ్లా, రమేష్, బ్రహ్మం, దావు, మంగు, రాజు, రంజీ, గంగమ్మ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తుంగతుర్తి : తిరుమలగిరిలో ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కలిసిన సీపీఎం నాయకులు

తుంగతుర్తి : అసెంబ్లీలో కార్మికుల సమస్యలను ప్రస్తావించి, వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కోరారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో తిరుమలగిరిలో ఎమ్మెల్యేను కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కళాశాలను, ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయించాలని కోరారు. ఎలాంటి పైరవీలకు తావు లేకుండా, పార్టీలకు, కులమతాలకు అతీతంగా ఆరు గ్యారంటీ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, పులుసు సత్యం, వజ్జే శ్రీనివాస్, గుమ్మడవెల్లి ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

తిరుమలగిరి : ఎమ్మెల్యే మందుల సామేల్‌ను తిరుమలగిరి మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చాగంటి యాదగిరి, వెంకన్న, శ్రీను, అయిలయ్య, సోమేష్, ఉపేందర్ ఉన్నారు.

రోడ్డు పనులు చేయించాలని వినతి

అర్వపల్లి : మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి రమణ, గంట నాగరాజు బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మందుల సామేలును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొత్తగూడెంరోడ్డు పూర్తిగా బీటీ లేచిపోయి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. బీటీ రెన్యువల్‌కు నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా పనులు చేపట్టలేదని తెలిపారు. అలాగే కొత్తగూడెం నుంచి జాజిరెడ్డిగూడెం వరకు ఉన్న లింకు రోడ్డును కూడా బీటీగా మార్చాలని కోరారు.

బడిబయటి పిల్లల గుర్తింపు

నూతనకల్ : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్పీలు రవీందర్, వీరస్వామి అన్నారు. బుధవారం నూతనకల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి పిల్లల వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి క్రీడోత్సవాలు

ఆత్మకూర్ (ఎస్) : తుమ్మలపెన్‌పహాడ్‌లో ఈ నెల 13, 14 తేదీల్లో జై భీమ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రచార కమిటీ కన్వీనర్లు గోనె నాగయ్య, బొలెద్దు వెంకన్న బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేశామని తెలిపారు. భవిష్యత్తులో మరింత బాధ్యతతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడల్లో గ్రామంలోని యువకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

అర్వపల్లి దర్గాకు కాంగ్రెస్ నాయకుడి పాదయాత్ర

మునగాల : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మావతిరెడ్డి గెలిస్తే అర్వపల్లి దర్గాకు పాదయాత్ర చేస్తానని మొక్కుకున్న కోదాడకు చెందిన కుడుముల శ్రీనివాసరావు బుధవారం పాదయాత్రగా దర్గాకు బయలుదేరాడు. మునగాల మండల కేంద్రంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరావుకు ఘన స్వాగతం పలికి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎండి.రషీద్, పి.జాను, గట్టు వెంకన్న, జిల్లా జాను, రామకృష్ణ, మహేష్, జయరాజ్, రాజేంద్రప్రసాద్, నరేష్, నరేందర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రాముడి అక్షింతలు

మోతె : మండలంలోని విభళాపురం గ్రామంలో అయోధ్య రాముడి అక్షింతలకు బుధవారం రామాలయం నుంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అక్షింతలను శ్రీరామ నామ కీర్తనతో ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏపూరి వీరస్వామి, భక్తులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూర్ (ఎస్) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మర్ల స్వర్ణలత అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని సమస్యలను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడంలేదని అన్నారు. కాగా ఆయా శాఖల అధికారులు నివేదికలను సభలో ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మల్సూర్‌నాయక్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రదర్శన



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

అర్వపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలపై వీబీఎస్‌వై ఆధ్వర్యంలో బుధవారం అర్వపల్లి, బొల్లంపల్లి గ్రామాల్లో ప్రచార వాహనం ద్వారా ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే సంబంధిత అధికారులు పీఎం కిసాన్, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, బీమా, పెన్షన్ పథకాలు, ఆయుష్మాన్‌భారత్ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏపీజీవీబీ మేనేజర్, నోడల్ అధికారి నటరాజన్, సర్పంచ్ దానం సుజాతయాదగిరి, నాగారం వైద్యాధికారి హర్షద్, వైద్యసిబ్బంది యాదగిరి, కిరణ్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లోయపల్లిలో సామాజిక తనిఖీ గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్, ఉపాధి సిబ్బంది

అర్వపల్లి : లోయపల్లిలో గతేడాది ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. గతంలో చేపట్టిన పనులపై చర్చించారు. ఈ పనులపై సోషల్ ఆడిట్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాదరి శాంతమ్మ, ఈసీ నగేష్, టీఏ యాదమ్మ, పంచాయతీ కార్యదర్శి భద్రమ్మ, మాజీ సర్పంచ్ వల్లపు గంగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఆరె సైదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉండ్రుగొండలో వైభవంగా రుద్రాభిషేకం



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల : మార్గశిర మాస శివరాత్రి సందర్భంగా చివ్వెంల మండలం ఉండ్రుగొండ శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీఉమామహేశ్వర స్వామికి బుధవారం వేదపండితులు రుద్రాభిషేకం నిర్వహించారు. బ్రహ్మశ్రీ మనోహర శర్మ మంత్రోచ్ఛరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బందకవి క్రిష్ణమోహన్, మధుసూదన్ రావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



నృత్యం చేస్తున్న చిన్నారులు

అర్వపల్లి : విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని అర్వపల్లి విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ పులిజాల వేణుగోపాలరావు అన్నారు. స్థానిక విజ్ఞాన్ పాఠశాల వార్షిక, స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని బుధవారం పాఠశాలలో నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం వీరాచారి, ఉపాధ్యాయ బృందం కార్యదర్శి మహేష్‌గౌడ్, రమేష్, అర్జున్, భద్రి, మహేష్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

అర్వపల్లి : ఎమ్మెల్యే మందుల సామేలుకు మంత్రి పదవి ఇవ్వాలని మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు దిర్శనపు కృష్ణమూర్తి అన్నారు. బుధవారం అర్వపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాదిగ సామాజిక వర్గం నుంచి సామేలుకు మంత్రి పదవి ఇస్తే మాదిగలకు తగిన న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు పందిరి సురేందర్, మాజీ ఎంపీటీసీ రమావత్ శంకర్, దిర్శనపు విజయ, కుంభం కళ్యాణిమదన్‌మోహన్, కసు కు రేణుక, చిగుర్ల సత్తయ్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని తుంగతుర్తి నియోజకవర్గ కోమటిరెడ్డి యువసేన అధ్యక్షుడు కేసాని రాహుల్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజగోపాల్‌రెడ్డికి ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేగా చేసిన అనుభవం ఉందని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సొంత ఖర్చులతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖమ్మంపాటి వెంకటేష్, షేక్ జహంగీర్, సందీప్, కార్తీక్, నితిన్, మహేష్, నిశాంత్, సాయి, చందు పాల్గొన్నారు.

మృతురాలికి నివాళి

తుంగతుర్తి : మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి, కాంగ్రెస్ సానుభూతిపరురాలు డేగా వత్సత్యమ్మ(67) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా మృతురాలి భౌతికకాయాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, జిల్లా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్‌రావు సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుడిపాటి నర్సయ్య, రాంబాబు, కొండ రాజు, అబ్దుల్, అరుణ్‌కుమార్, లలిత, తదితరులు పాల్గొన్నారు.

వన నర్సరీ పరిశీలన

అర్వపల్లి : హరితహారంలో భాగంగా వననర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై నిర్వాహకులు ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఏపీఓ చిలుక ఉపేందర్ కోరారు. బుధవారం జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కోడూరు గ్రామంలో నిర్వహిస్తున్న వన నర్సరీని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ నర్సరీలో 10 వేల మొక్కలను పెంచుతున్నామని చెప్పారు. వందశాతం మొక్కలు ఏపుగా ఎదుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నిద్ర సుజాత, వనసేవకుడు తదితరులు పాల్గొన్నారు.